క్లుప్తంగా

హాస్పిటల్‌కు వెళ్లి పింఛన్ అందజేత



కర్నూలులోని ప్రైవేట్ హాస్పిటల్‌లో మునాఫ్‌కు పింఛన్ అందజేస్తున్న గ్రామ వలంటీర్ ప్రభావతి

మిడుతూరు: మండల పరిధిలోని బైరాపురం గ్రామానికి చెందిన వృద్ధుడు మసాలా మునాఫ్ పక్షవాతం, ఊపరితిత్తుల వ్యాధితో బాధపడుతూ కర్నూలులోని ఓ ప్రవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ ప్రభావతి ఆదివారం హాస్పిటల్‌కు వెళ్లి వృద్ధాప్య పింఛన్ అందజేసింది.

ఆటపాటలతో 'చదవడం మాకిష్టం'



విద్యార్థులతో నీతికథలు చదివిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు, చిన్నారులకు ఆటపాటలతో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం లైబ్రేరియన్ కౌసల్య ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు తాడాట, కుర్చీలాట, చెస్, క్యారంబోర్డు వంటి ఆటలను ఆడించారు. అనంతరం జాతీయ నాయకుల, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్ర పుస్తకాలను, నీతికథలను చదివించారు.

గర్భిణులకు సీమంతాలు

మహానంది: గృహిణి నుంచి అంతరిక్షం వరకు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని మహానంది సర్పంచ్ చలంచలం శిరీష, స్వచ్ఛంద సేవకురాలు వసుమతి అన్నారు. మహానందిలోని ఈశ్వర్‌నగర్‌లో అంగన్‌వాడీ కార్యకర్త ఫాతిమా మేరీరాణి ఆధ్వర్యంలో ఆదివారం మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతం కార్యక్రమం నిర్వహించారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నంద్యాల జిల్లా అధ్యక్షులు సగినేల రమణ

పగిడ్యాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నంద్యాల జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సగినేల రమణ అన్నారు. ఆదివారం పడమర ప్రాతకోటలోని ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పదిహేనేళ్లుగా పార్టీ కోసం పనిచేయడం వలన అధిష్టానం గుర్తించి ఇటీవల ఉన్నత పదవిని కట్టబెట్టిందన్నారు. నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ఆశీస్సులతో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడి పదవి వరించిందన్నారు. జిల్లా వ్యాప్తంగా దళితుల కాలనీలలో పర్యటించి వారి సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తాన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంబటి వెంకటసుబ్బారెడ్డి, పాలమర్రి రాజు, రామకృష్ణ, తెలుగు వెంకటేశ్వర్లు, పల్లె బక్కన్న, సుభాన్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌తో ఉద్యోగ అవకాశాలు



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

శ్రీశైలంప్రాజెక్ట్: పాలిటెక్నిక్ విద్యను అభ్యసించడం వలన సులువుగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందే వీలుందని శ్రీశైలం ఆదర్శ గురుకుల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పాలిసెట్ కోఆర్డినేటర్ వాలియా నాయక్ అన్నారు. పాలిటెక్నిక్ అవగాహన పోస్టర్లను అధ్యాపకులు ఆదివారం కళాశాలలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ తక్కువ ఫీజ్‌తో పాలిసెట్ ద్వారా సీటు పొందవచ్చన్నారు. అంతేకాకుండా చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఫీజురియింబర్స్‌మెంట్ సదుపాయం ఉందని చెప్పారు. పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులకు సత్వర ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం

పాములపాడు: ఓటుతో ప్రజా స్వామ్యాన్ని కాపాడుకుందామని బీఎస్పీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ సాములు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని బానకచెర్ల గ్రామంలో బీఎస్పీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కన్వీనర్‌గా వెంకటరమణ, గ్రామ అధ్యక్షుడు సంగటి ప్రభుదేవా, ఉపాధ్యక్షుడు కురుమయ్య, ప్రధాన కార్యదర్శి బాలరాజు, సహాయ కార్యదర్శి సూర్యప్రకాష్, కోశాధికారిగా సామేలులతో పాటు 10 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పండు మిరప అ'ధర'హో

- ప్రస్తుత మార్కెట్‌లో క్వింటా ధర రూ. 20 నుంచి రూ. 22 వేలు
- నియోజకవర్గ వ్యాప్తంగా 6,863 ఎకరాలలో పండు మిరప సాగు
- ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి
- ఆనందంలో అన్నదాతలు



ఆరబెట్టిన మిరప

మిడుతూరు: గతేడాది వాతావరణం అనుకూలించక, తెగుళ్ల బెడదతో తీవ్రంగా నష్టపోయిన పండు మిరప రైతుకు ఈ ఏడాది లాభాలు వరిస్తున్నాయి. వాతారణం అనుకూలించి ఆశించిన మేర దిగుబడులు రావడంతో పాటు ప్రస్తుత మార్కెట్‌లో అధిక ధర పలుకుతుండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మిడుతూరు మండలంలో అత్యధికంగా సాగు..

నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని మిడుతూరు, జూపాడుబంగ్లా, పాములపాడు, నందికొట్కూరు, పగిడ్యాల, కొత్తపల్లి మండలాల్లో దాదాపు 6,900 ఎకరాల్లో సూపర్ -10, 334 రకం, ఆర్మూరు (బీఎస్ఎఫ్) రకం, కర్నూలు డీడీ -341 రకం, తేజ వెరైటీ, బాడీ రకం తదితర పండు మిరప రకాల సాగు చేపట్టారు. మిడుతూరు మండలంలోనే అత్యధికంగా 2,747 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేశారు. గతేడాది ప్రతికూల వాతావరణ పరిస్థితులకు తోడు పంటకు నల్ల తామర పురుగు, పచ్చనల్లి, ఎర్రనల్లి తదితర తెగుళ్ల ఆశించడంతో కారణంగా దిగుబడులు పెద్దగా రాలేదు. కొందరు పంటను పూత దశలోనే తొలగించారు. అయితే ఈ ఏడాది అనుకూల వాతావరణ పరిస్థితులకు తోడు ఉద్యానశాఖ అధికారులు, ఆర్‌బీకే సిబ్బంది సలహాలు, సూచనలతో మెరుగైన సస్యరక్షణ చర్యలను సకాలంలో చేపట్టడంతో మేలైన దిగుబడులు సాధించారు. ప్రస్తుతం ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది.

ఎకరాకు రూ .75 వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం

ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో పండుమిరప ధర క్వింటా రూ. 20 వేల నుంచి. రూ 22 వేల వరకు పలుకుతోంది. పంట సాగు వ్యయం ఎకరాకు రూ.దాదాపు 2 లక్షలు ఖర్చు అవుతుంది. మార్కెట్‌లో ధర మిరప పండు రకం, నాణ్యతను బట్టి మంచి ధర వస్తుండటంతో అన్నదాతకు పెట్టుబడి సాగు వ్యయం పోను ఎకరాకు రూ .75 వేల నుంచి రూ. లక్ష వరకు ఆదాయం వస్తుండటంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మెలకువలు పాటించడంతోనే లాభాలు



నేను గత పదేళ్లుగా ఏటా 20 ఎకరాలలో పండు మిరప సాగు చేపడుతున్నాను. భూమి స్వభావం, పండు మిరం రకం ఎంపిక, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సస్యరక్షణలో మెలకువలు పాటించడంతో మంచి దిగుబడితో పాటు లాభాలను పొందుతున్నా. ఈ ఏడాది బహిరంగ మార్కెట్‌లో క్వింటా ధర రూ. 20 వేల నుంచి 22 వేల వరకు పలుకుతుండటం కలిసొచ్చింది.

– తువ్వా రామనాగేశ్వరరెడ్డి, రైతు, మిడుతూరు

అదృష్టం కలిసివచ్చింది



నేను మొదటిసారిగా ఈ ఏడాది పొలం కౌలుకు తీసుకొని 5 ఎకరాలలో మిరప పంట సాగు చేశా. ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. బహిరంగ మార్కెట్‌లో మంచి ధర ఉండటంతో అదృష్టం కలిసివచ్చింది.

– షఫీ అహమ్మద్, కౌలు రైతు, కడుమూరు

విత్తన ఎంపిక సమయంలో జాగ్రత్తలు పాటించాలి..



రైతులు పంట సాగు సమయంలో మేలైన దిగుబడులు ఇచ్చే వంగడాలను ఎంపిక చేసుకోవాలి. ఎప్పటికప్పుడు అందుబాటులో ఉన్న అధికారులు, సైంటిస్టుల సలహాలు, సూచనలు పొందాలి. ఆర్‌బీకేల ద్వారా భూసార పరీక్షలు చేయంచుకోవడం, పంట మార్పిడి విధానం పాటించాలి. తెగుళ్ల సమయంలో సూచించిన మందులు నిర్ణీత మోతాదులో వేయడం, సస్యరక్షణ చర్యలు చేపట్టం ద్వారా మెరుగైన ఫలితాలు పొందవచ్చు.

– తేజస్వీని, ఉద్యానశాఖ అధికారిణి, నందికొట్కూరు

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు అంజాద్‌అలీ తెలిపారు. ఉదయం 9 గంటలకు పట్టణంలోని మార్కండేయ స్వామి ఆలయం సమీపంలో నూతన కల్యాణ మండపానికి భూమిపూజ, శ్రీశైలం రహదారిలోని షాదిఖానా నిర్మాణానికి సమీక్ష, జగనన్న మైనార్టీ కాలనీ పరిశీలన చేస్తారని చెప్పారు. అలాగే నాన్‌అమృత్ పథకం కింద రూ.116 కోట్లతో తాగునీటి ప్రాజెక్ట్ ఓవర్‌హెడ్‌ట్యాంక్‌ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించనున్నారు. కార్యక్రమానికి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ,కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

సరైన పత్రాలు లేకుండా వాహనాలు తిప్పొద్దు

కొత్తపల్లి: వాహనదారులు సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు తిప్పవద్దని ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఏ.సత్యనారాయణ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లైసెన్స్, ట్యాక్స్, వాహనాలకు చెందిన ఇతర ధ్రువపత్రాలు లేకుండా రోడ్లపై తిప్పితే వాటిని సీజ్‌చేస్తామని హెచ్చరించారు. తనిఖీలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 10 ట్రాక్టర్లకు సుమారు రూ.1.50లక్షలు జరిమానా విధించినట్లు తెలిపారు. సరైన ధ్రువపత్రాలు లేని 6 ట్రాక్టర్లను సీజ్ చేశామని చెప్పారు. పత్రాలు లేకుంటే ద్విచక్ర వాహనాలకు రూ.5వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

వైభవంగా పదహారు రోజుల పండుగ





మహానందిలో అంకురాలను తీసుకెళ్తున్న ఈఓ, పండితులు, ఓంకారంలో రథం వద్ద పూజలు

మహానంది: మహానందిలో ఆదివారం పదహారు రోజుల పండుగను వైభవంగా నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, ఆలయ ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, పండితులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విశేష పూజలు నిర్వహించారు. ముందుగా శ్రీ కామేశ్వరీ, మహానందీశ్వరస్వామివార్లకు మహారుద్రాభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం యాగశాల నుంచి అంకురాలను చండీశ్వరస్వామితో కలిసి తీసుకెళ్లి రుద్రగుండం కోనేరులో విసర్జన చేశారు. రథం వద్ద వివాహ దీక్ష, రథాంగ దేవతలకు విశేష పూజలు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో 16 రోజుల పండుగ

బండిఆత్మకూరు: ఓంకార క్షేత్రంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో 16 రోజుల పండుగను నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాల తర్వాత 16 రోజుల పండుగను నిర్వహించడం సంప్రదాయం. దీంతో ఓంకార క్షేత్రంలో గంగా ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేకంగా చేసిన నైవేద్యాలను సమర్పించారు. తర్వాత రథం వద్ద నైవేద్యాలను ఉంచి టెంకాయలు కొట్టి పూజలు చేశారు. రథాన్ని మిద్దెలోకి లాగి భద్రపరిచారు. కార్యక్రమంలో ఈఓ నాగప్రసాద్, ఆలయ చైర్మన్ విశ్వనాథ్‌రెడ్డి, ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, పాలకమండలి సభ్యులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



చౌట్కూరులో ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం



వెలుగోడులో ఓటు అభ్యర్థిస్తున్న ఎంపీపీ లాలం రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. నియోజకవర్గంలోని ఆత్మకూరు , శ్రీశైలం, వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం సాధారణ ఎన్నికలను తలపిస్తున్నాయి. అన్ని మండలాల్లో వివిధ పార్టీల అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం నిర్వహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులైన వెన్నపూస రవీంద్రారెడ్డి, మధుసూదన్‌ల గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం కొనసాగుతోంది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కోరుతూ కురుకుంద గ్రామంలో ఎంపీటీసీ సభ్యులు అబ్దుల్‌కలాం, వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు డాక్టర్ వెంకటేశ్వర్లు , మైనార్టీ నాయకులు మాబాషా ప్రచారం చేపట్టారు. ఆత్మకూరు పట్టణంలోని 16 వ వార్డు సభ్యులు విజయచౌదరి, 13 వ వార్డులో మున్సిపల్‌కోఆప్షన్‌సభ్యులు రషీద్, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు అంజాద్‌అలీ, ఏకలవ్య నగర్, సాయిబాబ నగర్ తదితర కాలనీల్లో ఇంటింటికీ తరిగి ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. సుల్తాన్, పార్వతి, విజయ్, హరిప్రసాద్, కలిముల్లా తదితరులు పాల్గొన్నారు. శ్రీశైలం మండలంలోని సున్నిపెంట , శ్రీశైలంలో పార్టీ నాయకులు రజాక్, కుమార్, అనీల్, ప్రభావతి ప్రచారం నిర్వహిస్తున్నారు.

వెన్నపూసకే మొదటి ప్రాధాన్యత ఓటు

కొత్తపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడైన అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ సింగారం వెంకటరమణ(రంగ), వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం మండలంలోని పెద్దగుమ్మడాపురం, సింగరాజుపల్లె, నందికుంట గ్రామాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కో-ఆప్టేడ్ సభ్యుడు మహమ్మద్‌గౌస్, సర్పంచు నక్క విజయ్‌కుమార్, ఎంపీటీసీలు శివన్న, బాలరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు జనార్దన్ రెడ్డి, నారాయణరెడ్డి, మునిరంగలు పాల్గొన్నారు. అదేవిధంగా కొత్తపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నలదాసు ప్రసాద్, సునీల్ గా ప్రచారం నిర్వహించారు.

రవీంద్రారెడ్డిని గెలిపించండి

మిడుతూరు: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్ రెడ్డి, సహకార సొసైటీ చైర్మన్ నాగతులసి రెడ్డి కోరారు. ఆదివారం మండల పరిధిలోని చౌట్కూరు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నబిరసూల్, వైఎస్సార్‌సీపీ నాయకులు తువ్వా లోకేశ్వరరెడ్డి, గోపాల్‌రెడ్డి, ఎల్లారెడ్డి, రామనాగేశ్వరరెడ్డి, కె.ఎల్లారెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓటేయండి

వెలుగోడు: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిఅమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివద్దిని చూసి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయాలని ఎంపీపీ లాలం రమేష్ కోరారు. ఆదివారం రవీంద్రారెడ్డి తరఫున వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టణంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల జయపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు మహమ్మద్ ఖాన్, అల్తాఫ్, మధు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రారెడ్డిని గెలిపించండి

బండిఆత్మకూరు : పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న వెన్న పూస రవింద్రారెడ్డికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పరమటూరు సహకార సంఘం చైర్మన్ శివలింగం, మండల ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టరు శశికళారెడ్డి కోరారు. ఆదివారం కడమలకాల్వ గ్రామంలో పట్టభద్రులను కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సర్పంచి మేరీ పుష్పాంజలి, రిటైర్డ్ హెచ్‌ఎం ఏసురత్నం, రాగాల బాబులు, మాజీ ఎంపీటీసీ భాస్కర్ పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: వైఎస్సార్‌సీపీ బలపరచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నుపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యతపు ఓటువేసి గెలిపించాలని జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ తోకల కృష్ణారెడ్డి, లింగాపురం సర్పంచు నాగార్జునరెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని పారుమంచాల, మండ్లెం గ్రామాల్లో పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోసిక తిరుమలేశ్వరరెడ్డి, పారుమంచాల వైస్ సర్పంచ్ హేమశేఖర్‌రెడ్డి, ఆనంద్ రజక, నరసింహయాదవ్, దినేష్, నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే గ్రామాల అభివృద్ధి

కొత్తపల్లి: వైఎస్సార్‌సీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని వైస్ ఎంపీపీ సింగారం వెంకటరమణ(రంగ), వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి అన్నారు. మండలంలోని దుద్యాల గ్రామపంచాయతీలోని మజరా గ్రామామైన కొత్తపమాడుగుల గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణాన్ని, గోకవరం పంచాయతీలోని మజరా లింగాపురంలో నిర్మితమవుతున్న మల్టీపర్పస్ గోడౌన్‌ను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారన్నారు. కొత్తమాడుగుల గ్రామంలో బీసీ కాలనీలో రూ.5లక్షల వ్యయంతో సీసీరోడ్డును నిర్మిస్తున్నట్లు చెప్పారు. అలాగే రైతులకు ఉపయోగకరంగా ఉండేందు, ధాన్యం భద్రపరచుకునేందుకు ప్రభుత్వం మల్టీపర్పస్ గోడౌన్ల నిర్మాణాలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో శేఖర్, వెంకటేశ్వరగౌడ్, పెద్ద శేషులు, విజయుడు, తిక్కస్వామి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి మస్తాన్ వలి ఉరుసు



కంబాలపాడులోని మస్తాన్‌వలి దర్గా

పాములపాడు: మండలంలోని కంబాలపల్లి గ్రామంలో వెలసిన మస్తాన్ వలి దాదా ఉరుసు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఈ నెల ఈ నెల 9,10 తేదీల్లో మస్తాన్‌వలి ఉరుసు మహోత్సవం నిర్వహించనున్నట్లు ముజావర్ బాదర్ల తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. దీర్ఘకాలిక రోగాలు సైతం స్వామి వారి దర్శనంతో నయమవుతాయని తెలిపారు.

జమాలయ్య దర్గా ఉరుసు

మహానంది:తిమ్మాపురం సమీపంలోని జమాల్‌వలి (జమాలయ్యదర్గా)దర్గాలో ఈ నెల 9, 10 తేదీల్లో గంధం, ఉరుసు వేడుకలు నిర్వహిస్తున్నట్లు ముల్లా ఖాదర్‌వలి, జమాల్ బాషా ఆదివారం తెలిపారు. 9వతేదీ రాత్రి అబ్దుల్లాపురం జిల్లెల్ల పెద్ద కొండయ్య, జిల్లెల్ల రామలక్ష్మమ్మల సహకారంతో కోలాటం ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు.

పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి

నంద్యాల: రాష్ట్రప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుతో ఆర్థిక వ్యవస్థను బలోపేతంచేసస్తూ యువకులకు ఉపాధి కల్పనకు పెద్దపీట వేయడం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజాసమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజునాయక్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విశాఖపట్టణంలో రెండు రోజుల పాటు గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహించి రూ.13.41లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకురావడం ఎప్పుడు జరగలేదన్నారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకొచ్చేందుకు సీఎం జగనన్న ఎంతో శ్రమించారన్నారు. పరిశ్రమలు ఏర్పాటైతే యువతకు భారీగా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. సమావేశంలో సమాఖ్య నాయకులు రవినాయక్, మల్లేష్‌నాయక్ పాల్గొన్నారు.

మహానందిలో భక్తుల సందడి



క్యూలో వేచి ఉన్న భక్తులు



మహానంది ఆలయం ముందు వేసిన కూల్‌పెయింట్

మహానంది: మహానంది ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా కనిపించింది. సెలవురోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామివార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. అలాగే కోదండరామాలయం, వినాయకనంది, గరుడనంది ఆలయాలను సందర్శించారు. ఉదయం అష్టవిధమహామంగళ హారతుల పూజలతో ప్రారంభమైన స్వామి,అమ్మవారి దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది.

ఆలయ ప్రాగణంలో కూలింగ్ పెయింట్

వేసవికాలం కావడంతో మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణాల్లో కూలింగ్ పెయింట్‌ను వేయించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి నంద్యాలకు చెందిన దాతల సహకారంతో రాజగోపురం, రెండు సుపథ మండపాల మధ్యలో నడక మార్గంలో భక్తుల కాళ్లు కాలకుండా పేయింట్ వేయించారు. అలాగే ఆలయంలోని క్యూలైన్లు, ఉత్తర, దక్షిణ గోపురాల లోపలి మార్గాల్లో కూడా కూలింగ్ పెయింట్‌ను వేయిస్తామని ఈఓ తెలిపారు. దాతల సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు.

'అదాని ఆస్తులను జప్తు చేయాలి'

నందికొట్కూరు: గౌతమ్ అదాని ఆస్తులను కేంద్రం ప్రభుత్వం జప్తు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయినా కేంద్రం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ సిలిండర్‌పై రూ. 50, కమర్షియల్ సిలిండర్‌పై రూ.350 పెంచడం దారుణమన్నారు. కేంద్రం గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఆశీర్వాదం, అరుణ్‌కుమార్, నాయకులు చౌడప్ప, గోవింద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అడవులను కాపాడుకుందాం

బండిఆత్మకూరు: అడవులను వేసవికాలంలో కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎఫ్‌ఆర్‌ఓ నాసిర్‌ఝా అన్నారు. ఆదివారం బరకలకాలనీలో అడవుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వేసవికాలం కావడంతో అడవిలో ధూమపానం చేయడం, నిప్పు కల్గించే వస్తువులు తీసుకెళ్లరాదని సూచించారు. జంతువులకోసం అడవిలో ఉచ్చులు ఏర్పాటు చేస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవో మదార్‌సాహెబ్ పాల్గొన్నారు.

వాహనాల వేలం

వెలుగోడు: ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలో వివిధ మద్యం కేసులలో పట్టుబడిన సుమారు 26 వాహనాలు (2 కార్లు, 05 ఆటోలు, 01 బొలెరో, 18 బైక్)లకు వేలం పాట నిర్వహించినట్లు ఎస్ఐ జగన్ మోహన్ తెలిపారు. స్థానిక పోలీస్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన వేలంలో సుమారు వంద మంది పాల్గొన్నారన్నారు. వేలంలో ప్రభుత్వానికి రూ. 6,78,300 ఆదాయం వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో ఆత్మకూరు సీఐ సుబ్రహ్మణ్యం, ఆత్మకూరు, నందికొట్కూరు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నేడు జీవాలకు టీకాలు

బండిఆత్మకూరు: మండలంలోని చిన్న దేవళాపురం, లింగాపురం గ్రామాల్లో జీవాలకు సోమవారం గాలికుంటు వ్యాధికి టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారిణి అనూష తెలిపారు. రైతులు తమ పశువులకు టీకాలు వేయించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో వేణుగోపాలస్వామి గ్రామోత్సవం



స్వామివారి విగ్రహం, గ్రామోత్సవంలో పాల్గొన్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల గ్రామంలో ఆదివారం శ్రీవేణుగోపాలస్వామి విగ్రహానికి గ్రామోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో టీటీడీ ఈఓ ధర్మారెడ్డి ఇంటి సమీపంలో నిర్మించిన ఆలయంలో ఈనెల 8న విగ్రహప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా పుణ్యాహవచనం, ఆచార్యవరణ, మృత్సంగ్రహణం, అంకురార్పణ, వేదారంభం, తదతర కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో స్వామివారి విగ్రహాన్ని కూర్చొండబెట్టి గ్రామ పురవీధుల్లో తిప్పారు. కార్యక్రమంలో టీటీడీ ఈఓ ధర్మారెడ్డి దంపతులు, జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, పారుమంచాల సర్పంచ్ పీఎం నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు నిత్యావసర వస్తువుల పంపిణీ

శ్రీశైలంప్రాజెక్ట్: కార్మికనాయకుడు తాళ్లూరి జనార్దన రావు 21 వ వర్ధంతి సందర్భంగా గిరిజనులకు ఏఐటీయూసీ నాయకులు ఆదివారం నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. ప్రకాశం జిల్లా చిన్నారుట్ల చెంచుగూడెంలో సుమారు 60 గిరిజన కుటుంబాలకు ఈ కిట్లను అందజేశారు. సున్నిపెంటలోని ఏఐటీయూసీ భవనం నుంచి కార్మికులు ర్యాలీగా వెళ్లి బస్టాండ్ ఆవరణలోని జనార్దనరావు విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్ నాయకులు డి.ఓబులయ్య, పి.పులిరాజు, బి.లక్ష్మయ్య, టి.వెంకట్, టీఎస్‌కె జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. రథోత్సవం



రథం లాగుతున్న భక్తులు

నందికొట్కూరు: మండల పరిధిలోని కొణిదేల గ్రామంలో వెలసిన శ్రీమత్కొణిదేల భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్ల రథోత్సవ వేడుకలు ఆదివారం సాయంత్రం వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే ఆర్థర్, భక్తులు నూతన వస్త్రాలు ధరించి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. తిరునాలకు నాగటూరు, బిజినవేముల, నెహ్రూనగర్ తదితర చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు రథోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీ సంఘటనలు జరగకుండా టౌన్ సీఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో ఎస్ఐలు ఎన్వీ రమణ, అశోక్, మారుతీశంకర్, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.